# సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

• ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం, జూన్ 28: శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగానికి శాశ్వతంగా సాగునీటిని అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఆయకట్టు రైతుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చే రామన్నపేట మండలం పల్లివాడ హెడ్‌వర్క్‌తో పాటు తుర్కపల్లి, సూరారం గ్రామాల సరిహద్దులో ఉన్న ఫీడర్ ఛానల్, వాటి షట్టర్లను ఆయకట్టు రైతులతో కలిసి కలియ తిరిగి పరిశీలించారు. ప్రాజెక్టు మరమ్మతుల కోసం గత ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని ఆ నిధులతో పనులను పూర్తి చేయకుండా అసంపూర్తిగా చేశారని అన్నారు. ప్రాజెక్టులో ఎల్లప్పుడు నీరు సమృద్ధిగా ఉండి రెండు కార్లకు సరిపడా సాగు నీటిని అందించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల ప్రతినిధి చామల వెంకటరమణారెడ్డి, చాడ సురేశ్ రెడ్డి, బండపల్లి కొమరయ్యగౌడ్, మాజీ సర్పంచ్ బండారు శంకరయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, ఆకుల శ్రీనివాస్, వేముల గోపి, పడాల రమేశ్, దేవేందర్, నిమ్మల మదు, నిమ్మల వీరస్వామి అధికారులు పాల్గొన్నారు.


పల్లివాడ హెడ్‌వర్క్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

## అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు

• మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, జూన్ 28 : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తున్నదని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందిన నాన్ టీచింగ్ ఉద్యోగులు మేకల తిరుపతయ్య, ఎస్కే మస్తాన్, అత్కూరి వెంకయ్యను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సరోజమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ చింతల సాయిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

# నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్

• చోరీకి గురవుతున్న యంత్రాలు, పరికరాలు
• పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

కట్టంగూర్, జూన్ 28 : విద్యార్థులు, ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన రక్షిత తాగునీటి పథకం (ఆర్వో ప్లాంట్) నిర్వాహణ లోపంతో నిరుపయోగంగా మారింది. కట్టంగూర్‌లో గల అంబటివాగు సమీపంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం అవరణలో ఓ ప్రత్యేక గదిలో అప్పటి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ నిధులు రూ.4.60 లక్షలతో ఏర్పాటు చేసి ఏప్రిల్ 2017లో ఆర్వో ప్లాంట్ ప్రారంభించారు. కానీ ప్లాంట్ నిర్వాహణ లోపంతో తో పాటు అధికారులు పట్టించుకోకపోవడంతో ఏడాదికే మూలన పడింది. ముందు చూపు లేకుండా గ్రామ శివారులో ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పర్యవేక్షణ కరువైంది. దాంతో గుర్తు తెలియని వ్యక్తులు గది తలుపులు పగలకొట్టి అందులో విద్యుత్ మోటర్లు, విలువైన యంత్ర పరికరాలు, విద్యుత్ వైర్లను అపహరించుకుపోయారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిరుపయోగంగా మారి ఆరేండ్ల కావస్తున్నా ఏ ఒక్క అధికారి, ప్రజాప్రతిధి కూడా పరిశీలించిన పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూలన పడిన ప్లాంట్‌ను అప్పటి గ్రామ ప్రజా ప్రతినిధులు గ్రామపంచాయతీకి అప్పజెప్పాలని కోరని ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా మారింది.అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్‌ను గ్రామంలో ఏర్పాటు చేసి మంచినీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.


కట్టంగూర్‌లోని అంబటివాగులో శిథిలావస్థకు చేరిన ఆర్వో ప్లాంట్ గది


నిరుపయోగంగా మారిన ఆర్వో ప్లాంట్ యంత్ర పరికరాలు


కేసీఆర్‌ను కలిసిన భరత్ గౌడ్

### బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నాయకులు

నార్కట్‌పల్లి జూన్ 28 : మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, సోషల్ మీడియా సభ్యుడు భరత్ గౌడ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

### నేడు పీఏసీఎస్‌ల సమావేశం

చిట్యాల, జూన్ 28 : ప్రభుత్వం అందజేస్తున్న రైతు బంధు పథకంపై రైతుల అభిప్రాయాల సేకరణ కోసం ఈ నెల 29న చిట్యాల, వెలిమినేడు వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల చైర్మన్లు సుంకరి మల్లేశ్‌గౌడ్, ఏనుగు రఘుమారెడ్డి తెలిపారు. పాలకవర్గ సభ్యులు, రైతులు సమావేశానికి హాజరై తమ సలహాలు, సూచనలు అందజేయాలని వారు కోరారు.

## మునుగోడును కాలుష్య రహితంగా తీర్చిదిద్దుదాం

• ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి • వివిధ శాఖల అధికారులతో సమీక్ష

మునుగోడు, జూన్ 28 : మునుగోడు నియోజకవర్గాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో యాద్రాది భువనగిరి, నల్లగొండ జిల్లాల పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పరిశ్రమల, కార్మిక శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కాలుష్యం వెద జల్లే కంపెనీలకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకున్నారా అని అధికారులను ప్రశ్నించారు. పరిశ్రమలు ఇచ్చే సీఎస్ఆర్ నిధులు ఎక్కడెక్కడ ఖర్చు చేస్తున్నారు, ఇక్కడ పరిశ్రమల్లో స్థానికులకు ఎంత మందికి ఉపాధి కల్పించారన్నారు. నియోజకవర్గంలోని కిష్టాపురం, గట్టుప్పల్ లో ఏర్పాటుయ్యే ఫార్మాకంపెనీలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇచ్చేది లేదున్నారు. నియోజకవర్గం కాలుష్యం బారిన పడకుండా అధికారులు సూచనలు ఇవ్వాలని కోరారు. అందరం కలిసి మునుగోడును కాలుష్యం లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుదామన్నారు. కాలుష్యం వెద జల్లే పరిశ్రమలపై మరోసారి పూర్తి వివరాలతో సమీక్ష చేస్తానన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

## ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

• కలెక్టర్ నారాయణరెడ్డి

చందంపేట, జూన్ 28: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వరం చర్యలు చేపట్టాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం చందంపేట తాసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, ఎంపీపీ పార్వతీచందునాయక్, తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ లక్ష్మి , జడ్పీటీసీ బుజ్జి లచ్చిరాంనాయక్, భరత్‌కుమార్ లక్మానాయక్, సత్యనారాయణ, డిప్యూటీతాసీల్దార్ గోవర్ధన్‌రెడ్డి, ఆర్ఐ నజీర్,అనిల్ పాల్గొన్నారు.


చందంపేట తాసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి


మోటకొండూరు : శ్రీకర్‌రెడ్డికి నియామక పత్రం అందిస్తున్న పాల సంఘం సభ్యులు

## పాడి రైతుల అభివృద్ధికి కృషి

• దిలావర్‌పూర్ పాల సంఘం నార్మూల్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి

మోటకొండూర్, జూన్ 28 : పాడి రైతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని దిలావర్‌పూర్ నార్మూల్ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దిలావర్‌పూర్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరుసగా 11వ సారి లింగాల శ్రీకర్ రెడ్డి చైర్‌న్‌గా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా నమిల రమేశ్, జివిలికపల్లి సందీప్, ఎర్రగోళ్ల మల్లేశ్, పాండు, దండు ఉపేందర్, చొప్పరి అశోక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన పాడి రైతులకు ప్రభుత్వ పరంగా వచ్చే పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. తనను చైర్మన్‌గా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో జడ్పీటీసీ వెంకట్‌రెడ్డి, సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### కాటేపల్లి చైర్మన్‌గా శివరాత్రి రాములు

మండలంలోని కాటేపల్లి పాల సంఘం చైర్మన్‌గా శివరాత్రి రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా సూదగాని రమేశ్, మంత్రి రాజమల్లుతోపాటు పలువురు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంత్రి రాజు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కానుగంటి కొమురయ్య, నాయకులు సాయికిరణ్‌గౌడ్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

### ఎస్ లింగోటం పాల ఉత్పత్తిదారుల సంఘం ఎన్నిక

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని ఎస్ లింగోటం గ్రామ నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆకుల పద్మ చైర్మన్‌గా, పల్సం పద్మ, గురుకంటి దుర్గమ్మ డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి డిల్లీ మాధవరెడ్డి, నాయకులు శంకరయ్య, యాదగిరి, కృష్ణ, లింగస్వామి పాల్గొన్నారు.

### తుర్కపల్లి పాల సంఘం చైర్మన్‌గా చంద్రం

తుర్కపల్లి : తుర్కపల్లి పాల సంఘం చైర్మన్‌గా మోత్రాస్‌పల్లి చంద్రం ఎన్నికయ్యారు. శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో డైరెక్టర్లుగా జివిలికపల్లి మల్లేశం, సోమల్ల సతీశ్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్లను పాడి రైతులు సన్మానించారు.

### గుండ్లగూడెం పాల సంఘం చైర్మన్‌గా రంగయ్య

ఆలేరు రూరల్, జూన్ 28 : మండలంలోని గుండ్లగూడెం పాల సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మైదం రంగయ్య, డైరెక్టర్లుగా మేకల జంగమ్మ, పుష్పమ్మ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్‌ను మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంపల విజయ్ పాల్గొన్నారు.

### పేరూరు స్వయంభూ సోమేశ్వర ఆలయ భూముల కౌలు వేలం

హాలియా, జూన్ 28 : పేరూరు గ్రామంలోని స్వయంభూసోమేశ్వర ఆలయ భూములను జూలై 1న పేరూరు ఆలయ ప్రాంగణంలో కౌలు వేలం వేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రిక్కల కొండారెడ్డి, ఆలయ కార్య నిర్వహణ అధికారి వెంకటనారాయణ శుక్రవారం తెలిపారు. పేరూ రు, ఇబ్రహీంపేట, బంకాపురం గ్రామ శివారులో ఉన్న ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గలవారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు వేలం దక్కించుకున్న వారు ఆలయ భూమిలో మట్టితవ్వకం, చెట్లు నరకడం వంటి పనులు చేయరాదని సూచించారు.

### తండ్రి మందలించడంతో మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మునుగోడు,జూన్ 28 : తండ్రి మందలించాడని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన మండలంలోని కొరటికల్ గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన వల్లూరి లింగయ్య కుమారుడు శివ (22) ఇంటర్ పూర్తి చేసుకొని ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడుగా ఉండేవాడు. ఇటీవల సెల్‌ఫోన్‌కు బాగా దగ్గరయ్యారు. వ్యవసాయ పనులు ప్రారంభంకావడంతో సెల్‌ఫోన్ తక్కువ చేసి పనులు చేయమని తండ్రి మందలించడంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు కిందికి దింపిగా అప్పటికే మరణించారు. లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం పంపినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## రామన్నపేట దవాఖానను 100 పడకలకు మార్చాలి

రామన్నపేట, జూన్ 28 : రామన్నపేట ప్రభుత్వ దవాఖానను 100 పడకలకు మార్చి అవసరమైన సదుపాయాలు కల్పించాలని, వైద్యులు, సిబ్బందిని నియమించాలని తెలుగు యువత మండలాధ్యక్షుడు మిర్జా ఫజల్‌బేగ్ అన్నారు. ఈ మేరకు దవాఖాన సూపరింటెండెంట్ వీరన్నకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్నపేటకు ఆరు మండలాల ప్రజలు వస్తుంటారని, ఇక్కడ సదుపాయలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి నకిరేకంటి గణేశ్, నాయకులు వెంకటేశం, ప్రభాకర్, మల్లేశం, వీరయ్య, నరేశ్, మహేందర్ పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ఆత్మకూరు(ఎం), జూన్ 28 : మండలంలోని మొరిపిరాల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాస పద్మారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ తండ మంగమ్మ హాజరై మాట్లాడారు. హెచ్ఎంగా పద్మారెడ్డి ఎంతో మంది విద్యార్థులకు ఉత్తమ విద్య అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్ది ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జూలై 8 వరకు పదో తరగతి రీ వెరిఫికేషన్

సూర్యాపేట అర్బన్, జూన్ 28 : ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో 86.63 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు జూలై 8 వరకు రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రూ.1000 చాలనా చెల్లించి రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీ కౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.500 చెల్లించాలని తెలిపారు. వివరాలకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.

## రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తా

• డిండి మండల సమావేశంలో ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్

డిండి, జూన్ 28: రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నీటిపారుదల, విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా కింద ఎకరాకు ఏటా రూ.15వేలు, ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్ఎల్‌బీసీ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేస్తే పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. డిండి పట్టణం అభివృద్ధికి, అంగడి బజార్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో వారిని శాలువాతో సత్కరించి మోమెంటోలను అందజేశారు. సమావేశంలో ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు, తాసీల్దార్ తిరపతయ్య, జడ్పీటీసీ మాధవరం దేవేందర్‌రావు, ఎంపీడీఓ దానేల్, నీటిపారుల శాఖ ఈఈ శ్రీధర్‌రావు, డీఈ శ్రీనివాస్, ఏఈ ఫయాజ్, ఎంపీటీసీ, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


డిండి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : డీఈఓ భిక్షపతి

మునుగోడు,జూన్ 28 : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఈఓ భిక్షపతి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా జరిగే మరమ్మతుల పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.అనంతరం పాఠశాలలో విద్యార్థినులకు అందించే భోజనం,తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో బాలికల ప్రత్యేకాధికారి జె.సంధ్యారాణి,ఉపాధ్యాయులు ఉన్నారు.


తరగతి గదిని పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్లు

## అభివృద్ధి చేసినవారిపై అవినీతి మరకలు వేసే ప్రయత్నం


• మున్సిపల్ వైస్ చైర్మన్ కిశోర్

బొడ్రాయిబజార్, జూన్ 28 : సూర్యాపేట పట్టణాన్ని అభివృద్ధి చేసినవారిపై అవినీతి మరకలు అంటించే ప్రయత్నం జరుగుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ అభివృద్ధికి రూ.80కోట్ల నిధులు కేటాయించి.. పనులు ప్రారంభమైన తరువాత నిధులను వెనక్కి మళ్లించడం కాంగ్రెస్‌కే చెందుతుందన్నారు. ఓట్లు వేయలేదని పట్టణాన్ని నాశనం చేసే బాధ్యతను కాంగ్రెస్ తీసుకుందని విమర్శించారు. అభివృద్ధిలో సూర్యాపేట నంబర్ 1గా ఉంది కాబట్టే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హ్యాట్రిక్ గెలుపు సాధ్యమైందన్నారు. మూడుసార్లు ప్రజలు తిరస్కరించారనే అక్కసుతో నిర్మాణాల కూల్చివేతలు మొదలు పెట్టారని కాంగ్రెస్‌పై మండి పడ్డారు. సూర్యాపేటకు రావాల్సిన నీటి వాటా గురించి మంత్రి ఉత్తమ్‌ను నిలదీయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లకు సూచించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కౌన్సిలర్లు చింతలపాటి భరత్ మహాజన్, తాహేర్ పాషా మాట్లాడుతూ 50 ఏండ్ల చరిత్రలో ఓ దళిత మహిళ చైర్‌పర్సన్‌గా ఉంటే అమెను కించపరుస్తున్నారని, దళితులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులుగౌడ్, నాయకులు ఆకుల లవకుశ, బత్తుల జాని, కొండపల్లి సాగర్‌రెడ్డి, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి, శ్రీపాది జానకిరామ్, బైరు వెంకన్న తదితరులు ఉన్నారు.

## యాక్టివ్ బ్లీడింగ్ కంట్రోల్ కిట్ ఎంతో ఉపయోగకరం

• డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడటౌన్, జూన్ 28 : రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు యాక్టివ్ బ్లీడింగ్ కంట్రోల్ కిట్ ఎంతో ఉపయోగపడుతుందని డీఎస్పీ శ్రీధర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మేళ్లచెర్వు కాశీనాథం ఫంక్షన్ హాల్‌లో ఐరాష్ట్ర తెలంగాణ, జీఎంఆర్, నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో యాక్టివ్ బ్లీడింగ్ కంట్రోల్ కిట్‌పై వీధి వ్యాపారులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొని మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో రక్త స్రావం కాకుండా ఈ కిట్ ఉపయోగపడుతుందన్నారు. కిట్‌ను తయారు చేసిన సంస్థలను ఆయన అభినందించారు. అనంతరం కిట్ ఉపయోగాలను చూపించి అందజేశారు. కార్యక్రమంలో ఐ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ గోవింద కృష్ణ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రతినిధులు శైలజ, శ్రీనివాస్, కోదాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


రక్తస్రావ నియంత్రణకు కిట్ ఎలా ఉపయోపడుతుందో డెమో చూపుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

## సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధిరులు దృష్టి పెట్టాలి

• నాంపల్లి మండల సమావేశంలో ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత

నాంపల్లి, జూన్ 28 : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులు దృష్టి పెట్టాలని ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత, జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. వారం రోజుల్లో ఎంపీటీసీ పదవి కాలం ముగుస్తుండడంతో ప్రత్యేకాధిరుల బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. అధికారులు అన్ని శాఖ అధికారులతో సమన్వయంతో పని చేయలన్నారు. వర్షకాలం కాబట్టి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీటీసీ పదవీ కాలం ముగుస్తుండడంతో సన్మానించారు. కార్యాక్రమంలో ఎంపీడీఓ మేరి స్వర్ణకుమారి, ఎంపీటీసీ బెక్కం రమేశ్, అన్నెపాక సరిత, సప్పిడి రాధిక. దాసరి సాలమ్మ, మండల కోప్షన్ సభ్యుడు అబ్బస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


నాంపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత

## ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

• ఏడీఏ శ్రీలక్ష్మి

మాల్, జూన్ 28: రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ శ్రీలక్ష్మి అన్నారు. చింతపల్లి మండలం వెంకటేశ్వర నగర్‌లోని ఎరువుల దుకాణాల యజమానులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని, పురుగుల మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై ఉంచాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన రశీదు తప్పకుండా ఇవ్వాలన్నారు. రైతులు తమ పంట వివరాలను తమ పరిధిలోని ఏఈఓల వద్ద నమోదు చేయించు కోవాలని కోరారు. ఆమె వెంట ఏఓ పి.శ్రావణ కుమారి, ఏఈఓలు ఉన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ శ్రీలక్ష్మి

## కార్మికుల డిమాండ్స్ డేను జయప్రదం చేయాలి

• సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

యాదగిరిగుట్ట, జూన్ 28 : జూలై 10న కార్మికుల డిమాండ్ డేను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం అధ్యక్షతన శుక్రవారం జరిగిన పెద్దకందుకూరు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని చెప్పిందన్నారు. సహజ వనరులైన బొగ్గు బావుల ప్రైవేటీకరణకు పూనుకున్నదని తెలిపారు. బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మికుల నిరసనలు, ధర్నాలు చేసి డిమాండ్ డేను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శిగా చెక్క రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుబ్బూరు సత్యనారాయణ, నాయకులు పుప్పాల గణేశ్ పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టం అమలు చేయాలి

• బహుజన ప్రజాశక్తి వ్యవస్థాపక రాష్ట్ర కన్వీనర్ లక్ష్మణ్

భూదాన్ పోచంపల్లి, జూన్ 28 : విద్యా హక్కు చట్టం అమలు పరుచాలని.. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని బహుజన ప్రజాశక్తి వ్యవస్థాపక రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ కోరారు. శనివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ మేరకు పట్టణ కేంద్రంలో శుక్రవారం సమావేశం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో విద్యా వ్యవస్థకు 15శాతం నిధులు కేటాయించాలన్నారు. కేజీ నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లు, రెసిడెన్సియల్ కాలేజీలు, యూనివర్సిటీలను బాగు చేయాలని, బహుజన వర్గాల నుంచి యూనివర్సిటీ వైస్ చాన్సలర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చింతకింది రమేశ్, భారత భూషణ్, మధు, ప్రేమ్, నాగేశ్వర్, నరేశ్, దానయ్య, సుధాకర్, వెంకటేశం, రవి, యాదయ్య, బాలనరసింహ, లింగస్వామి, రమేశ్, గణేశ్ పాల్గొన్నారు.


సూర్యాపేట ప్రభుత్వ పాఠశాలలో 102 ఆకారంలో కూర్చున్న నూతన ప్రవేశాలు పొందిన విద్యార్థులు

## ప్రభుత్వ పాఠశాలలో 102 కొత్త అడ్మిషన్లు

• నాణ్యమైన బోధన వల్లే : హెచ్ఎం

సూర్యాపేట అర్బన్, జూన్ 28 : ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతుందని, నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం బోధన వల్ల అడ్మిషన్లు పెరుగుతున్నాయని ప్రధానోపాధ్యాయుడు జె.ఆంద్రయ్య అన్నారు. జూనియర్ కళాశాల పక్కన గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 102 కొత్త అడ్మిషన్లు వచ్చిన సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేటులో భారీగా పెరిగిన ఫీజులు, దానికి తోడు నాణ్యమైన విద్య కూడా లభించడం లేదని గుర్తించిన తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల బాట పడుతున్నారన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను వివిధ తరగతుల్లో కలిపి 102 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని మొత్తం 186 మంది విద్యార్థులు ఉన్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రవేశాలు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు గతం కంటే ఉత్సాహంగా పని చేసేందుకు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం ప్రవేశాలు పొందిన విద్యార్థులు 102 ఆకారంలో కూర్చొని అలరించారు.